క్లుప్తంగా

తీగజాతి చెట్టు తొలగింపు



నడికూడ : మండల కేంద్రంలోని గొల్లవాడలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలకు అల్లుకుని ఉన్న తీగజాతి చెట్టు తీగలను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు. తీగజాతి చెట్టు తీగలు విద్యుత్ వైర్లకు అల్లుకుని ప్రమాదకరంగా ఉండడంతో సాక్షి దినపత్రికలో శనివారం 'పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఏఈ ఇందూజ స్పందించి తీగజాతి చెట్టును తొలగింపజేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

'ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం'

వేలేరు : వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని మాజీ ఎంపీటీసీ జ్యోతి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఎండీ.పర్వీన్, యాకుబ్ ఆరోపించారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. వేలేరులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇంటి స్థలాన్ని నలభై ఏళ్ల క్రితమే కొనుగోలు చేశామని, స్థలానికి సంబంధించిన పత్రాలు, గ్రామ పంచాయతీ అనుమతి, కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నాయిని తెలిపారు. అయినా ఇంటిస్థలం తమదని మాజీ ఎంపీటీసీ బత్తుల జ్యోతి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఇంటి స్థలంలో గోడ నిర్మాణం చేసుకుంటుండగా జ్యోతి, ఆమె కుమార్తె శ్రావణి దాడికి దిగినట్లు బాధితులు ఆరోపించారు. అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాంబరాజు (ఫైల్)

ఐనవోలు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లికుంట గ్రామానికి చెందిన సూర సాంబరాజు (25) కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 17వ తేదీన మండలంలోని వడ్డెరగూడెం గ్రామానికి ఆయన మేనత్త ఇంటికి పల్సర్ బైక్‌పై వెళ్లాడు. తిరిగి రాత్రి బొల్లికుంట స్వగ్రామానికి చేరుకునే క్రమంలో పున్నేలు క్రాస్ వద్ద ఇండికేటర్లు వేయకుండా రోడ్డుపై నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న సాంబరాజును బాటసారులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనం ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. అజాగ్రత్తగా రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి తన భర్త మరణానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి భార్య రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



కమలాపూర్ : మహిళా సంఘాల సభ్యులందరు ఇంటింటికి ఆరు, అంతకన్నా ఎక్కువ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని ఉప్పల్, ఉప్పులపల్లి, గూనిపర్తి గ్రామాలను శనివారం ఆయన సందర్శించి నర్సరీలు, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లో మహిళా సంఘాల సభ్యులకు పూల, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని అన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు ప్రోత్సాహకం

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష రాసి టాపర్‌గా నిలిచిన హిమబిందుకు అభయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం రూ.5 వేల నగదు ప్రోత్సహకం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనిల్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని అన్నారు.

బీటీ రోడ్లకు కలగని మోక్షం

- ఏళ్లు గడుస్తున్నా మట్టిరోడ్లే దిక్కు
- వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వేములపల్లి నుంచి కొండాపూర్ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

వేలేరు : మండలంలోని పలు గ్రామాలు బీటీ రోడ్లకు నోచుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా కొన్ని గ్రామాలకు ఇప్పటికీ సరియైన రోడ్డు మార్గం కల్పించలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మట్టిరోడ్డే దిక్కు..

మండలంలోని పీచర శివారు వేములపల్లి నుంచి కొండాపూర్ వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డుతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు గుంతలు పడి పూర్తిగా బురదమయంగా మారిందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి గుంతలు కనపడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ఘటనలూ ఉన్నాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ దారిలో ఉన్న పెద్దవాగులోకి భారీగా వరద వస్తే రెండు, మూడు రోజులు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, ఎర్రబెల్లి నుంచి వేలేరు మండల కేంద్రానికి వయా చింతల తండా మీదుగా జాజిరేణికుంట చెరవుకట్ట మీదుగా వెళ్లే రోడ్డు గుంతలమయంగానే ఉందని వాపోతున్నారు. చెరువుకట్టకిరువైపులా వ్యవసాయబావులు ఉండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గతంలో వర్షానికి కొట్టుకుపోయిన మట్టిరోడ్డు

ఇబ్బంది పడుతున్నాం



వేములపల్లి నుంచి కొండాపూర్ గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఏళ్లు గడుస్తున్నా బీటీ రోడ్డు నిర్మించలేదు. ప్రభుత్వాలు మారినా మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించలేదు. వర్షాకాలంలో మట్టిరోడ్డుపై గుంతలుపడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

- మండల శంకర్, వేములపల్లి

అధైర్య పడకండి.. అండగా ఉంటా

- కార్యకర్తలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భరోసా



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్: ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తన అనుచరులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఉద్యమ సమయం నుంచి మీ వెన్నంటే ఉంటూ ప్రస్తుతం మీతోపాటే బీజేపీలో చేరామని, తమకు బీజేపీలో తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అవకాశం ఇస్తారో? లేదోనని ఆందోళన చెందుతున్న ఈటల వర్గీయులు ఇటీవల కమలాపూర్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేరుగా ఈటలను కలిసి తమ పరిస్థితి వివరించేందుకు శనివారం కమలాపూర్ మండలం నుంచి శామీర్‌పేటలోని రాజేందర్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఎంపీతో స్థానికంగా నెలకొన్న పరిస్థితిని వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అనుచరులు, కార్యకర్తల ఆవేదన అర్థమైందన్నారు. పది రోజులకు ఒకసారి హుజూరాబాద్ వస్తానని, మీ వెంటే ఉండి స్థానిక ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు

- గత పాలకులపై ఎమ్మెల్యే గండ్ర ధ్వజం



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పరిపాలన చేసి ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ పేదల గురించి ఆలోచించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుక్షణం పేద, అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆలోచిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్న బియ్యం అందించే ఏకై క ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. అధికారులు, మధ్యవర్తులు, నాయకులు పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో అవినీతికి చోటులేదన్నారు.

వినతిపత్రం అందించిన 108 సిబ్బంది

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 అంబులెన్స్ సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. తమకు వసతి కల్పించాలని వినతిలో కోరారు. రాత్రి విధులకు ప్రత్యేక గది కేటాయించకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వరండాలో, అంబులెన్స్‌లో భోజనం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి, హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటేలా ప్రతీ కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో ఆత్మకూరు, దామెర మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ఎండగట్టాలన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం రైతుకు రెండు బస్తాల యూరియా దొరకడం లేదని అన్నారు. యూరియా తెచ్చుకుంటున్న రైతులపై కేసులు పెడుతున్నారన్నారు. పోలీస్‌లు కాంగ్రెస్ నేతలు చెప్పినట్లే చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడరని స్పష్టం చేశారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఐక్యంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. నాయకులు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. నియోజకవర్గంలో 109 సర్పంచ్ స్థానాలకు 109 స్థానాలు కై వసం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ఆత్మకూరు, దామెర మండలాల అధ్యక్షులు లేతాకుల సంజీవ రెడ్డి, రామకృష్ణ, మండల ప్రధానకార్యదర్శి కుమార స్వామి, మాజీ ఎంపీపీ శంకర్, మాజీ జెడ్పీటీసీ కల్పన, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, జాకీర్ అలీ, నాయకులు కృపాకర్‌రెడ్డి, రవియాదవ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పారిశ్రామికవేత్త చేయూత



వేలేరు : మండలంలోని షోడాషపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గడ్డి రవి చేయూతనందించారు. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు –మన బడి పథకంలో పాఠశాలలో అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు కావడం లేదని పనులు అసంపూర్తిగా వదిలేశాడు. విషయం తెలుసుకున్న గడ్డి రవి తన స్వంత ఖర్చులతో అదనపు గదులు పూర్తిచేసి తలుపులు, కిటికీలు, ఇతర మరమ్మతులు చేసేందుకు కలెక్టర్ అనుమతి కోరగా కలెక్టర్ అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఒక ప్రైవేట్ టీచర్‌ను నియమించారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ టీషర్ట్‌లు, స్పోర్ట్స్ మెటిరియల్ అందించారు. అలాగే గ్రామశివారు పిట్టలగూడెం విద్యార్థులు పాఠశాలకు కాలినడకన వస్తుండటంతో వారికి ఆటో సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ సంప్రదాయాలను గౌరవించాలి



దామెర : వివిధ వేషధారణలో విద్యార్థినులు



శాయంపేట : బోనాలతో విద్యార్థులు



పరకాల : బిట్స్ పాఠశాలలో..

దామెర : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, పాటించాలని ఏకశిల పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పాఠశాలలో శనివారం ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయరీతిన బోనం తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ పాఠశాల ప్రాంగణంలో తిరుగుతూ, పోతరాజు, ఇతర వేషధారణలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల శ్రీవేద పాఠశాలలో బోనాల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం విజయ్ మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో గ్రామగ్రామాన బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు విద్యార్థులకు తెలియపర్చేందుకు వేడుకలు నిర్వహించినట్లు తెలి పారు. ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తిరెడ్డి ఉన్నారు.

పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాలలో బోనాల వేడుకలను విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మట్టికుండలో బోనాలు వండుకుని పోతరాజుతో ఊరేగింపులు, నృత్యాలు చేస్తు పలువురిని ఆకట్టుకున్నారు. పాఠశాల ఏట రాజేందర్, ప్రిన్సిపాల్ యుగేందర్ ఎల్లమ్మతల్లి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేయగా ఉపాధ్యాయులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి బెంకాయలు కొట్టారు.

ఆర్థికసాయం



శాయంపేట : ఆర్థికసాయం అందజేస్తున్న నాగరాజు స్నేహితులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాగరాజు చిన్ననాటి స్నేహితులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు రూ. 16,500 ఆర్థికసాయం అందించారు. రాజేందర్, నాగరాజు, మురళి, భరత్, సంతోశ్, సురేందర్, తిరుపతి, భూపాల్, రాజు ఉన్నారు.

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దండు రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను పులుకుర్తి ఆటో యూనియన్ అధ్యక్షుడు పెంచాల జగన్ ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఉపాధ్యక్షుడు దయాకర్, సభ్యులు రాజు, జయేందర్, శ్రీధర్ ఉన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై జక్కుల పరమేశ్



మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టిసారించాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, మాందారిపేట శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం అవుతుందన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నియత్రణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ భిక్షపతి, వైద్యాధికారి సాయికృష్ణ, ఎంజేపీ ప్రిన్సిపాల్ రేవతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ సేవలను వినియోగించుకోవాలి



ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ ఆదిరెడ్డి

ఐనవోలు : వ్యవసాయశాఖ అందించే సేవలను రైతులు వినియోగించుకోవాలని ఏడీఏ ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో దర్గా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారానికి నష్టం వాటిల్లుతుందన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడొద్దన్నారు. నానో ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ సునీల్‌కుమార్, ఏఈఓ అఫ్రీన్, దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, వైస్ చైర్మన్ మాదాసు బాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

- హెచ్‌ఎం సంధ్యారాణి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : జన్మనిచ్చిన తల్లిదండ్రులే ఆదిగురువులని, వారి రుణం తీర్చుకోలేనిదని హెచ్‌ఎం సంధ్యారాణి అన్నారు. మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవించిన వారే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తారని, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. తల్లిదండ్రులను మించిన దైవం లేదని, వారిని పూజించాలని సూచించారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, నరసింహాచారి, జయకృష్ణ కుమార్ నాయుడు, రామచంద్రమూర్తి, భిక్షపతి, లలిత, స్వప్న, విష్ణుప్రియ, భాస్కర్, మాధురి, పాఠశాల సహాయకుడు సిద్ధార్థ పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌తో హాజరు నమోదు

- డీఈఓ వాసంతి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

ఎల్కతుర్తి : విద్యార్థుల హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్‌తో నమోదు చేయాలని డీఈఓ వాసంతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌ను ఉపయోగించి విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సైన్స్ దృక్పథాలను అలవర్చే విధంగా కృషిచేయాలని సూచించారు. ఉపాధ్యాయ బోధన తీరును, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట జీసీడీఓ సునితా, ఎంఈఓ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ఉపాధ్యాయులు ఉన్నారు.

కేజీబీవీ ఇంటర్‌లో రేపు స్పాట్ అడ్మిషన్లు

నర్సంపేట/సంగెం : చెన్నారావుపేట, సంగెం మండలాల్లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఇంటర్ ప్రవేశాల కోసం రేపు (ఈనెల 21న) స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు స్పెషల్ ఆఫీసర్లు మెట్టుపల్లి జ్యోతి, నీలిమ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్ నర్సింగ్), సీఈసీ విభాగాల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా వచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. మండలంలోని విద్యార్థినులు వినియోగించుకోవాలన్నారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన



దామెర : అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

దామెర / నడికూడ : నానో యూరియాపై రైతులు అవగాహన కలిగి ఉండాలని దామెర ఏఈఓ రామకృష్ణ అన్నారు. మండలంలోని పులుకుర్తిలో శనివారం నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూరియా అధిక మొత్తంలో వినియోగించడం వలన భూసారం తగ్గి, ఖర్చు పెరుగుతుందన్నారు. నానో యూరియాతో మెరుగైన నత్రజని పంటకు అందుతుందన్నారు. అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అలాగే నడికూడ మండలంలోని నార్లపూర్‌లో నానో యూరియా వినియోగంపై ఏఓ జైసింగ్ రైతులకు అవగాహన కల్పించారు.

అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లిన కారు

- నలుగురికి స్వల్ప గాయాలు
- కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో ఘటన



కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొస్తున్న ప్రయాణికులు

ఐనవోలు: కారు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శనివారం మండలం కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్, ఖమ్మం రహదారిపై వేగంగా వెళ్తున్న కారు టైర్ పగిలిపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మామిడి తోటలోకి దూసుకెళ్లింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అదే రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు స్పందించి వెంటనే కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. అతివేగంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పోచమ్మ గుడి స్థలాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న నాగిశెట్టి ప్రసాద్

నర్సంపేట : పట్టణంలోని పదో వార్డులోని పోచమ్మ గుడి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు నాగిశెట్టి ప్రసాద్ కోరారు. ఆలయ ఆవరణలో కాలనీవాసులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాతల, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కొందరు నాయకులు ఆలయ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణకు యత్నించే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు.